క్లుప్తంగా

వేపగుంటలో ఎన్‌సీఈఆర్‌టీ బృందం పర్యటన



విద్యార్థులతో ఎన్‌సీఈఆర్‌టీ బృందం ప్రతినిధులు

పెందుర్తి : ఢిల్లీకి చెందిన ఎన్‌సీఈఆర్‌టీ బృందం వేపగుంటలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రాలను గురువారం సందర్శించారు. ఈసీసీఈ, జాతీయ విద్యావిధానం, విద్యాభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలపై ఆరా తీశారు. విద్యార్థులు, తల్లిదండ్రులతో ముఖాముఖి నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వం విద్య కోసం అమలు చేస్తున్న పథకాలను ప్రశంసించారు. ఎన్‌సీఈఆర్‌టీ బృందం ప్రతినిధులు ప్రొఫెసర్ వి.పి.సింగ్, దిలీప్‌వర్మ, శిల్పా మనోజ్, నిఖిత, డైట్ కళాశాల అధ్యాపకుడు సోమయాజులు, మండల విద్యాశాఖ అధికారి మధుమూర్తి, సీఆర్‌పీలు దుర్గాప్రసాద్, రమణమూర్తి, తదితరులు పాల్గొన్నారు.

సందడిగా మహిళా దినోత్సవం



గ్రంథాలయంలో మహిళా దినోత్సవంలో పాల్గొన్న మహిళలు

పెందుర్తి: స్థానిక శాఖ గ్రంథాలయంలో గురువారం అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని సందడిగా నిర్వహించారు. మ్యూజికల్ చైర్, పాసింగ్ బాల్, లెమన్ అండ్ స్పూన్ ఆటలతో మగువలు సందడి చేశారు. విజేతలకు వైఎస్సార్‌సీపీ సీనియర్ నేత దాడి రమణచిట్టి చేతుల మీదుగా బహుమతులు అందజేశారు. గ్రంథాలయాధికారి బి.సూర్యకళ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో గ్రంథాలయాభివృద్ధి కమిటీ చైర్మన్ పెతకంశెట్టి భూలోకరావు, ఉపాధ్యాయులు ఉషారాణి, రామలక్ష్మి, లలిత, ఉమ, తేజస్విని పాల్గొన్నారు.

ముఖ్యమంత్రి జగనే మళ్లీ సీఎం కావాలని దీక్ష



ఇడుపులపాయలో డాక్టర్ వైఎస్సార్ సమాధి వద్ద నివాళులర్పిస్తున్న గోవింద పట్నాయక్

పెందుర్తి : ముఖ్యమంత్రిగా మరోసారి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పదవి చేపట్టాలని కోరుతూ 153 రోజుల ఆంజనేయస్వామి దీక్ష చేపట్టిన వైఎస్సార్ ట్రేడ్ యూనియన్ జిల్లా కార్యదర్శి గోవింద పట్నాయక్ గురువారం దీక్ష విరమించారు. కడపలోని గండి వీరాంజనేయస్వామి దేవాలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఇడుపులపాయలో మహానేత డాక్టర్ వైఎస్సార్ సమాధిని దర్శించుకుని నివాళులర్పించారు.

కేజీబీవీలో శిక్షణ తరగతుల పరిశీలన



విద్యార్థులకు సూచనలు చేస్తున్న ఎంఈవో సూర్యనారాయణమూర్తి

సబ్బవరం: పదో తరగతి పరీక్షల్లో విద్యార్థులు శతశాతం ఉత్తీర్ణత సాధించేలా ఉపాధ్యాయులు పని చేయాలని ఎంఈవో బోళెం సూర్యనారాయణమూర్తి సూచించారు. స్థానిక కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో బాలికలకు నిర్వహిస్తున్న ప్రత్యేక శిక్షణ తరగతులను గురువారం ఆయన పరిశీలించారు. ఈ ఏడాది పరీక్షలకు పాఠశాల నుంచి 38 మంది విద్యార్థులు హాజరు కానున్నట్లు తెలిపారు. గణితంతో పాటు పలు సబ్జెక్టుల్లో శిక్షణ తరగతులు నిర్వహిస్తున్న ఉపాధ్యాయులను, పాఠశాల ప్రత్యేకాధికారి మృదులను ఆయన అభినందించారు.

వ్యాన్ ఢీకొని యువకుడి మృతి

సింహాచలం: వ్యాన్ ఢీకొని యువకుడు దుర్మరణం చెందాడు. ఈ సంఘటన గురువారం రాత్రి అడవివరం ప్రధాన రహదారిలో జరిగింది. వివరాలు ఇలా ఉన్నాయి. పార్వతీపురం మన్యం జిల్లా వీరఘట్టం మండలం కడకర్ల గ్రామానికి చెందిన పెనుగొండ శ్రీను(20) సింహాచలం కొండపై ఒక ప్రైవేటు హోటల్‌లో పని చేస్తున్నాడు. గురువారం రాత్రి 10 గంటల సమయంలో ద్విచక్రవాహనంపై పాత అడవివరం జంక్షన్ నుంచి సింహాచలం మార్కెట్ కూడలి వైపు వస్తున్నాడు. చింతచెట్టు వద్ద రహదారిపై అదే మార్గంలో ఇటుకుల లోడుతో వెళ్తున్న మినీ వ్యాన్ ఢీకొంది. తలకు తీవ్రగాయమవడంతో శ్రీను సంఘటన స్థలంలోనే మృతి చెందాడు. గోపాలపట్నం ఎస్ఐ రామకృష్ణ సంఘటనా స్థలాన్ని పరిశీలించి వివరాలు సేకరించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కేజీహెచ్‌కి తరలించారు.

శివపూజకు వేళాయె..

- మహా శివరాత్రికి ముస్తాబైన శైవక్షేత్రాలు
- నేటి వేకువజాము నుంచి ప్రత్యేక పూజలు
- ముత్యాలమ్మపాలెం తీరంలో సముద్ర స్నానానికి ఏర్పాట్లు



పినగాడిలో కొలువుదీరిన చోడేశ్వరస్వామి



సింహగిరిపై ఉన్న కాశీవిశ్వేశ్వరస్వామి



పుణ్య స్నానాలకు అనువైన ముత్యాలమ్మపాలెం తీరం

పెందుర్తి: మహా శివరాత్రి పర్వదినానికి శైవక్షేత్రాలు ముస్తాబయ్యాయి. విద్యుత్ కాంతులతో ఆలయాలు ప్రకాశిస్తున్నాయి. పూజల కోసం భక్తులు వేకువజాము నుంచి రానుండడంతో ఆయా ఆలయ కమిటీలు ప్రత్యేక ఏర్పాట్లు చేశాయి. షామియానాలు, క్యూ లైన్లు ఏర్పాటు చేశాయి. భక్తుల సౌకర్యార్థం మంచినీరు, మజ్జిగ వితరణ ఏర్పాట్లు జరుగుతున్నాయి.

సాధుమఠంలో స్వయంభూ శివుడు

పెందుర్తి సాధుమఠం వద్ద స్వయంభూ రామలింగేశ్వర స్వామిని దర్శించుకునేందుకు అధిక సంఖ్యలో భక్తులు రానుండటంతో అందుకు అనుగుణంగా ఏర్పాట్లు చేస్తున్నారు. శివరాత్రి సందర్భంగా రామలింగేశ్వరస్వామికి శుక్రవారం రుద్రాభిషేకం, క్షీరాభిషేకం నిర్వహించనున్నారు.

- సరిపల్లిలోని పురాతన శివాలయం, పినగాడిలోని గణేశ పార్వతి సమేత చోడేశ్వరస్వామి ఆలయాల్లో ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు.
- శ్రమశక్తి నగర్‌లోని రామలింగేశ్వర స్వామి ఆలయం, సుజాతనగర్ హరిహర క్షేత్రం, కృష్ణరాయపురం, గణేష్‌నగర్, చింతలగ్రహారంలో వేడుకలు జరగనున్నాయి.
- మహాకామేశ్వరి పీఠంలో, చినముషిడివాడ పంచముఖ ఆంజనేయస్వామి దేవాలయంలో మహాశివరాత్రి సందర్భంగా ప్రత్యేక కార్యక్రమాలు జరుగుతాయని ఆయా దేవాలయాల ప్రతినిధులు తెలిపారు.

ముత్యాలమ్మపాలెం తీరంలో..

పరవాడ: ముత్యాలమ్మపాలెం తీరంలో కొలువుదీరిన రామలింగేశ్వర ఆలయాన్ని రంగు రంగుల విద్యుత్ తోరణాలతో ముస్తాబు చేశారు. మహాశివరాత్రి సందర్భంగా భక్తులు శుక్రవారం రాత్రి జాగరణ చేసి శనివారం వేకువ జామున సముద్ర తీరంలో పుణ్యస్నానాలు ఆచరిస్తారు. అనంతరం రామలింగేశ్వరస్వామిని దర్శించుకుని, ప్రత్యేక పూజలు చేసి తీర్థ ప్రసాదాలను స్వీకరిస్తారు. మహాశివరాత్రిని పురస్కరించుకుని గ్రామ సచివాలయ కన్వీనర్ బొంది అచ్చిబాబు ఆధ్వర్యంలో శుక్రవారం రాత్రికి తీరంలో పలు సాంస్కృతిక కార్యక్రమాలను ఏర్పాటు చేశారు. పుణ్య స్నానాలు ఆచరించడానికి వచ్చే భక్తుల కోసం తీరంలో తాత్కాలిక స్నానపు గదులను ఏర్పాటు చేశారు. తీరంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పరవాడ సీఐ ఎస్.బాలసూర్యారావు పోలీసు బందోబస్తును ఏర్పాటు చేస్తున్నారు.

- పరవాడ మల్లికార్జునస్వామి ఆలయం, తాడి ఉమానీలకంఠేశ్వర స్వామి ఆలయం, భర్నికం, దీపాంజలి నగర్, నాయుడుపాలెం ప్రాంతాల్లో శివాలయాల్లో భక్తుల రద్దీకి అనుగుణంగా ఏర్పాట్లు చేస్తున్నారు.

త్రిపురాంతక స్వామి ఆలయంలో..

సింహాచలం: సింహగిరి క్షేత్రపాలకుడిగా విరాజిల్లుతున్న త్రిపురాంతకస్వామి ఆలయంలో, కాశీవిశ్వేశ్వరస్వామి ఆలయంలో మహాశివరాత్రిని ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. ఆయా ఆలయాల్లో ఉదయం 5 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు, తిరిగి సాయంత్రం 4 గంటల నుంచి రాత్రి 7గంటల వరకు స్వామికి అభిషేకాలు, విశేష పూజలు నిర్వహించనున్నారు. రాత్రి 10 గంటల నుంచి మహారుద్రాభిషేకాలు, లింగోద్భవ పూజలు జరుగుతాయని దేవస్థానం అధికారులు తెలిపారు.



సింహగిరి క్షేత్రపాలకుడు త్రిపురాంతకస్వామి

- 98వ వార్డు సింహపురి కాలనీలోని ఉమారామలింగేశ్వర స్వామి ఆలయంలో ఉదయం 5 గంటల నుంచి 10.30గంటల వరకు అభిషేకాలు జరుగుతాయని కమిటీ ప్రతినిధులు తెలిపారు. రాత్రి 8.30గంటల నుంచి స్వామి వార్షిక కల్యాణ మహోత్సవం, బేడా సేవ, రాత్రి 12గంటల నుంచి లింగోద్భవ పూజలు, నక్షత్ర హారతి నిర్వహిస్తామన్నారు.
- పాత అడవివరం, కాపుదిబ్బ, విజినిగిరిపాలెం, ప్రియాగా రైన్స్‌లోని శివాలయాల్లో పరమేశ్వరుడికి విశేష పూజలు నిర్వహించేందుకు అర్చకులు ఏర్పాట్లు చేశారు.

ఉమామహేశ్వరస్వామి ఆలయంలో బ్రహ్మోత్సవాలు

93వ వార్డు ప్రహ్లాదపురంలోని ఉమా మహేశ్వరస్వామి ఆలయంలో జరుగుతున్న బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం మహాశివరాత్రికి ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. తెల్లవారుజామున 4 గంటల నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు అభిషేకాలు, సాయంత్రం 6గంటల నుంచి రాత్రి 7గంటల వరకు రుద్ర పాశుపత హోమం, రాత్రి 9గంటలకు మహన్యాస పూర్వక రుద్రాభిషేకం నిర్వహించనున్నారు.

పేదల సొంతింటి కల నెరవేర్చిన సీఎం జగన్

- అర్హులందరికీ సంక్షేమ పథకాలు
- ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు



పాత గోశాల లే అవుట్‌లో శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు



లబ్ధిదారులకు ఇళ్ల పట్టాలు అందజేస్తున్న ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు

సింహాచలం : అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందించిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి దక్కుతుందని, 99 శాతం హామీలు నెరవేర్చిన ఘనత ఆయనదేనని ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు అన్నారు. భీమిలి నియోజకవర్గం పరిధి జీవీఎంసీ 98వ వార్డులోని 572 మంది లబ్ధిదారులకు పూర్తి హక్కులతో రిజిస్ట్రేషన్ చేసిన ఇళ్ల పట్టాలు బాలాజీనగర్‌లోని కల్యాణ మండపంలో గురువారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదల కళ్లల్లో ఆనందం చూడాలన్నదే సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఉద్దేశ్యమన్నారు. అర్హులైన ప్రతీ పేదవాడి సొంతింటి కల నెరవేర్చారన్నారు. ప్రస్తుతం జగనన్న కాలనీలు పెద్ద ఎత్తున ఏర్పడ్డాయన్నారు. ప్రజా సంక్షేమంతో పాటు, రాష్ట్రాభివృద్ధికి సీఎం జగన్ కృషి చేశారన్నారు. దేశంలో రూ.3 వేల పింఛన్ అందిస్తున్న ఏకైక రాష్ట్రం ఆంధ్రప్రదేశ్ అని, ఏకైక ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డే అన్నారు. 98వ వార్డులో సంక్షేమ పథకాల కోసం రూ.125 కోట్లు ఖర్చు చేశామన్నారు. అవినీతికి తావులేకుండా, లంచాలు తీసుకోకుండా, పార్టీలకు అతీతంగా అర్హులందరికీ సంక్షేమ ఫలాలు అందించిన ఘనత జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. వలంటీర్, సచివాలయ వ్యవస్థ ద్వారా ప్రజలకు అన్ని రకాల సంక్షేమ ఫలాలు అందిస్తున్నామన్నారు. డ్వాక్రా రుణాలు మాఫీ చేస్తానని, సున్నా వడ్డీకే రుణాలు ఇస్తానని చంద్రబాబు మహిళలను మోసం చేశారని గుర్తు చేశారు. ఎన్నికల సమయంలోనే చంద్రబాబుకి మహిళలు గుర్తుకు వస్తారని విమర్శించారు. ఐదేళ్ల జగన్ పాలనని... గతంలో చంద్రబాబు పాలనని ప్రజలంతా గమనించాలని కోరారు. టీడీపీ, జనసేన నాయకుల కల్లబొల్లి మాటలు నమ్మొద్దని పిలుపునిచ్చారు. టీడీపీ ప్రభుత్వంలో పేదలకు అడుగడుగునా అన్యాయం జరిగిందన్నారు. సంక్షేమ పథకాలు కొనసాగాలన్నా... ప్రజలకు మంచి జరగాలన్నా మళ్లీ సీఎం జగన్‌మోహన్‌రెడ్డే ముఖ్యమంత్రి కావాలన్నారు. ఇళ్ల పట్టాలు మరో నాలుగు వందల మందికి రాలేదని చెబుతున్నారని, వారికీ అందిస్తామని తెలిపారు. కార్యక్రమంలో జెడ్పీ హేమావతి, వైఎస్సార్‌సీపీ 98వ వార్డు అధ్యక్షుడు కొలుసు ఈశ్వరరావు, వార్డు ఇన్‌చార్జి ఎర్ర వరహా నరసింహం, నాయకులు పీతల అప్పలరాజు, కర్రి అప్పలస్వామి, నడింపల్లి రామరాజు, లంక సత్తిబాబు, సిరిపురపు కృష్ణ, గంట్ల కిరణ్ పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన

సింహాచలం : అడవివరంలోని పాత గోశాల వద్ద ఉన్న సింహగిరి పునరావాసుల లే అవుట్‌లో రూ.20 లక్షలతో సీసీ రోడ్ల నిర్మాణానికి ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు గురువారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గడిచిన ఐదేళ్ల వైఎస్సార్‌సీపీ పాలనలో ప్రజా సంక్షేమంతోపాటు అభివృద్ధి పనులకు పెద్ద పీట వేశామన్నారు. నిర్మాణ పనులు త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో జెడ్పీ హేమావతి, గోశాల నిర్వాసితులు ముగ్గు కిరణ్, కస్తూరి సత్తిబాబు, ఎస్.చిన్నారావు, కోరుకొండ నరసింహమూర్తి, నమ్మి శివ, పండూరు మురళి, తెలగారపు తిరుంబాబు, వైఎస్సార్ సీపీ 98వ వార్డు అధ్యక్షుడు కొలుసు ఈశ్వరరావు, వార్డు ఇన్‌చార్జి ఎర్ర వరహా నరసింహం, అడవివరం కోఆపరేటివ్ సొసైటీ అధ్యక్షుడు కర్రి అప్పలస్వామి, నాయకులు పీతల అప్పలరాజు, తెడ్లపు మహేష్ పాల్గొన్నారు.

మహిళా పక్షపాతి సీఎం జగన్

- 95వ వార్డు కార్పొరేటర్ ముమ్మన దేముడు



లబ్ధిదారులకు ఇళ్ల స్థలాల రిజిస్ట్రేషన్ పత్రాలు అందిస్తున్న కార్పొరేటర్ ముమ్మన దేముడు

పెందుర్తి : ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి రాష్ట్రంలోని మహిళలకు ఎంతో మేలు చేస్తున్నారని 95వ వార్డు కార్పొరేటర్ ముమ్మన దేముడు అన్నారు. వార్డు పరిధిలోని 499, 500 నంబరు సచివాలయాల పరిధిలోని జగనన్న ఇళ్ల స్థలాల రిజిస్ట్రేషన్ పత్రాలను 304 మంది లబ్ధిదారులకు గురువారం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగనన్న కాలనీల్లో అక్కచెల్లెమ్మల పేరిట స్థలాలు రిజిస్ట్రేషన్ చేసి ఇవ్వడం దేశ చరిత్రలోనే గొప్ప విషయమన్నారు. ప్రజలపై నిజమైన ప్రేమ కలిగిన నాయకుడు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని కొనియాడారు. ముఖ్యమంత్రిగా ఆయన్ను మరోసారి గెలిపించుకోవాల్సిన బాధ్యత అందరిపై వుందన్నారు. 'థాంక్యూ సీఎం సర్... జై జగన్' అంటూ లబ్ధిదారులు పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు కంచిబోయిన సంతోష్, బొడ్డు దేముడుబాబు, అంగటి సూరిబాబు, లక్ష్మణ్, దువ్వి అప్పారావు, బొట్ట రాము, గంట్ల నరసింహమూర్తి, చిప్పల నాగదీప, ప్రసాద్, రావర్తి కాశీ పాల్గొన్నారు.

నృసింహ యజ్ఞం టికెట్ల విక్రయాలు ప్రారంభం



ఏఈఈ హరికి టికెట్ అందజేస్తున్న దేవస్థానం ఈవో శ్రీనివాసమూర్తి

సింహాచలం: సింహగిరిపై ఈ నెల 26 నుంచి వచ్చే నెల 1 వరకు జరగనున్న శ్రీ సుదర్శన నారసింహ మహా యజ్ఞం నిర్వహణకు సంబంధించి భక్తుల సౌకర్యార్థం సమాచార కేంద్రం ఏర్పాటు చేశారు. సింహాచలంలోని కొండదిగువ శ్రీదేవి కాంప్లెక్స్‌లో ఏర్పాటు చేసిన సమాచార కేంద్రం, టికెట్ల విక్రయ కేంద్రాన్ని సింహాచలం దేవస్థానం ఈవో ఎస్.శ్రీనివాసమూర్తి గురువారం ప్రారంభించారు. ఈవో మాట్లాడుతూ యజ్ఞానికి సంబంధించిన పూర్తి సమాచారం ప్రత్యేక కేంద్రంలో లభిస్తుందని తెలిపారు. టిక్కెట్లు అందుబాటులో ఉంటాయన్నారు. తొలిటిక్కెట్టు కొనుగోలు చేసిన దేవస్థానం ఏఈఈ హరికి ఈవో టిక్కెట్టు అందజేశారు. దేవస్థానం పురోహిత్ అలంకారి కరి సీతారామాచార్యులు, ఏఈవో నరసింగరావు పాల్గొన్నారు.

మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి



వేడుకల్లో పాల్గొన్న మహిళలతో ప్రిన్సిపాల్ చంద్రశేఖర్


పెందుర్తి: విద్యార్థి దశ నుంచి బాలికలు ఎంచుకున్న రంగంలో ముందుకు సాగాలని పెందుర్తి ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.చంద్రశేఖర్ సూచించారు. ప్రస్తుత రోజుల్లో మహిళలు అన్ని రంగాల్లోనూ రాణిస్తూ అగ్రస్థానానికి చేరుకోవడం మంచి పరిణామమన్నారు. పెందుర్తి ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో గురువారం ప్రపంచ మహిళా దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజంలో లింగ వివక్షకు తావులేదన్నారు. రాష్ట్ర ప్రభుత్వం మహిళా భద్రతకు అధిక ప్రాధాన్యమిస్తోందన్నారు. వివిధ రాష్ట్రాల్లోని సంప్రదాయ దుస్తులు ధరించిన స్కిల్ హబ్ ట్రైనీలు ఫ్యాషన్ షోలో పాల్గొని ఆకట్టుకున్నారు. పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందించారు. శ్రీదేవి విజ్ఞాన జ్యోతి పరిష్కార్ చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపకురాలు డాక్టర్ కుప్పిలి కీర్తి పట్నాయక్, అధ్యాపకులు మూర్తి, ఎం.నాగమణి, ప్రవీణ, సౌజన్య తదితరులు పాల్గొన్నారు.

సబ్బవరం ప్రభుత్వ కళాశాలలో..

సబ్బవరం: విద్యార్థినులు అన్ని రంగాల్లో రాణించాలని సబ్బవరం ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బి.సీతాలక్ష్మి సూచించారు. సహ విద్యార్థులకు ఆదర్శంగా నిలవాలన్నారు. మహిళా దినోత్సవం సందర్భంగా కళాశాల మహిళా సాధికారిక విభాగం, ఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యంలో కళాశాలలో గురువారం నిర్వహించిన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. విద్యార్థినులు చదువుతో పాటు క్రీడలు, సాంస్కృతిక రంగాల్లో విజయం సాధించాలని ఆకాంక్షించారు. రాజకీయాల్లోనూ రాణించి మహిళా సాధికారతను సాధించాలన్నారు. కళాశాల అభివృద్ధికి తమ తోడ్పాటు అందించాలని సూచించారు. కార్యక్రమంలో అధ్యాపకులు డాక్టర్ ఎం.రత్నప్రకాష్, డాక్టర్ ఎస్.సత్యనారాయణ, ఎం.వి.రామకృష్ణ, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ ఎల్.గణేష్ తదితరులు పాల్గొన్నారు.

సిబ్బంది అప్రమత్తతతో ప్రమాదాల నివారణ

- జేఎన్ ఫార్మాసిటీలో మాక్‌డ్రిల్



మాక్‌డ్రిల్‌లో పాల్గొన్న సిబ్బంది

పరవాడ: జాతీయ భద్రత వారోత్సవాల్లో భాగంగా జేఎన్ ఫార్మాసిటీలో ఆఫ్‌సైట్ మాక్‌డ్రిల్ గురువారం నిర్వహించారు. పరిశ్రమల శాఖ ఆధ్వర్యంలో లారస్ ల్యాబ్‌లో సింతసిస్ ప్లాంటు, జేపీఆర్ ల్యాబ్స్, సింతోకేమ్ పరిశ్రమల్లో రసాయనాలు వెలువడి విస్ఫోటనం జరిగిందన్న సమాచారంతో ఆఫ్ సైట్ మాక్‌డ్రిల్ నిర్వహించారు. మాక్‌డ్రిల్‌లో భాగంగా ముందుగా రాంకీ హబ్, ఎంఏఎస్ఆర్ఎం ఉద్యోగులను కంపెనీ బస్సుల ద్వారా ఇతర ప్రాంతాలకు తరలించారు. ప్రమాద బాధితులను వైద్య సేవల కోసం పరవాడ, అగనంపూడి, రాంకీ ఆస్పత్రులకు తరలించారు. అగ్ని ప్రమాదాన్ని నివారించడానికి రాంకీ, ఎన్టీపీసీ, లారస్ ల్యాబ్‌లకు చెందిన అగ్నిమాపక శకటాలు హుటాహుటిన ఘటనా ప్రాంతాలకు చేరుకొని సహాయక చర్యలు చేపట్టి మంటలు అదుపు చేశాయి. ఫార్మాసిటీలో నిర్వహించిన ఈ మాక్ డ్రిల్ పలువురిని ఆకట్టుకుంది. అనంతరం ఎంఏఎస్ఆర్ఎం ఆవరణలో నిర్వహించిన సమావేశంలో ఏడీఎఫ్‌వో ప్రసాదరావు మాట్లాడుతూ విధి నిర్వహణలో ఉద్యోగులు అప్రమత్తంగా వ్యవహరిస్తే ప్రమాదాలు నివారించవచ్చన్నారు. కార్యక్రమంలో ఎన్‌డీఆర్ఎఫ్ టీం లీడర్ ఈశ్వరరావు, లారస్ ల్యాబ్స్ వైస్ ప్రెసిడెంట్ ఎస్.శ్రీనివాసరావు, డిప్యూటీ చీఫ్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ వి.సురేష్, ఎంఏఎస్ఆర్ఎం అధ్యక్ష, కార్యదర్శులు శివరాంప్రసాద్, జెట్టి సుబ్బారావు, లారస్ ల్యాబ్స్ జీఎం ఎం.శ్రీనివాస్, మైలాన్ జీఎం రామసుబ్బారావు పాల్గొని ప్రసంగించారు.

సింహగిరీశునికి స్వర్ణ సంపెంగలతో అర్చన



స్వర్ణపుష్పాలతో అప్పన్న ఉత్సవమూర్తులు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహ స్వామికి గురువారం ఆర్జిత సేవలు నేత్రపర్వంగా జరిగాయి. ఉదయం 7 గంటల నుంచి స్వర్ణ పుష్పార్చనను వైభవంగా నిర్వహించారు. ఆలయ కల్యాణ మండపంలో స్వామివారి ఉత్సవ మూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను వేదికపై కొలువుదీర్చి, 108 స్వర్ణ సంపెంగలతో స్వామికి అష్టోత్తర శతనామావళి పూజ నిర్వహించారు. ఉభయదాతలకు స్వామివారి శేష వస్త్రాలు, ప్రసాదాన్ని అందజేశారు.

శాస్త్రోక్తంగా నిత్య కల్యాణం : శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి నిత్య కల్యాణాన్ని గురువారం శాస్త్రోక్తంగా జరిపించారు. ఉదయం 9.30 గంటలకు ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను కల్యాణ మండపంలో కొలువుదీర్చి కల్యాణ మహోత్సవం జరిపించారు. ఉభయదాతలకు అర్చకులు స్వామి శేషవస్త్రాలు, ప్రసాదం అందజేశారు.

విద్యార్థులు ఉన్నతంగా రాణించాలి



విద్యార్థులతో ర్యాలీ నిర్వహిస్తున్న ఇస్కఫ్ ప్రతినిధులు

సింహాచలం: భారత సాంస్కృతిక సహకార స్నేహ సంఘం(ఇస్కఫ్) ఆధ్వర్యంలో అడవివరం జిల్లా పరిషత్ హైస్కూల్లో గురువారం అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. అనంతరం నిర్వహించిన సమావేశంలో నాగార్జున యూనివర్సిటీ మాజీ వీసీ ప్రొఫెసర్ బాలమోహన్‌దాస్ మాట్లాడుతూ విద్యార్థులు మంచి నడవడికతో, ఉన్నతంగా రాణించాలన్నారు. కార్యక్రమంలో ఇస్కఫ్ ప్రతినిధి దేవరకొండ మార్కండేయులు, జెడ్పీ హైస్కూల్ ప్రధానోపాధ్యాయుడు ఇమంది పైడిరాజు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.